క్లుప్తంగా

నూతన సంవత్సర వేడుకలకు అందుబాటులో రాజన్నదొర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, రఘు

సాలూరు: నూతన సంవత్సర నేపథ్యంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో అందుబాటులో ఉంటారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరిరఘులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు రాజన్నదొర అందుబాటులో ఉంటారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రజలు ఆ సమయంలో రాజన్నదొరవద్దకు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపవచ్చన్నారు.

నేడు మున్సిపల్ సర్వ సభ్య సమావేశం

పార్వతీపురంటౌన్: మున్సిపల్ సర్వ సభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి అంజెండా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయ చంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



చొక్కాపు వానివలస గ్రామంలో బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పార్వతీపురంటౌన్: మండలంలోని చొక్కాపు వాని వలస గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వామపక్షనాయకులు సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులకు తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో ప్రజలతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇంటింటికీ కుళాయిలు వేసినప్పటికీ తాగునీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం పరిశీలన



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు

సాలూరు: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పరిశీలించారు. ఈ మేరకు సోమవారం కార్యాలయానికి వచ్చిన ఆయన రికార్డులను తనిఖీచేశారు. శాఖాపరంగా పట్టుకున్న కేసులు తదితర అంశాలపై ఆరా తీశారు. వివిధ కేసుల్లో పట్టుకున్న మద్యం, సారాను ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీఐ గులిపిల్లి దాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది

సాలూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని, గ్యారేజీ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించి సరైనటు టూల్స్‌ను సప్లై చేయాలని కోరారు. కొందరు అధికారులు, కొందరు సూపర్‌వైజర్లు చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలపై తగు విచారణ జరిపి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు.

అధికారులు నిర్లక్ష్యంగా ఉండకూడదు

• గ్రీవెన్స్‌సెల్‌కు 106 అర్జీలు



అర్జీలు అందుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు రూరల్:

అధికారులు ప్రజాసమస్యలపై నిర్లక్ష్యంగా ఉండకూడదని గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సాలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలనుంచి 106 అర్జీలు అందుకున్నారు. అందులో మున్సిపాలిటీ పరిధిలో శివాలయం రోడ్డు మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తల విషయమై భవాని ఆలయ పూజారితో పాటు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై మున్సిపల్ డీఈని కలెక్టర్ పిలవగా సమావేశంలో లేకపోవడంతో ఆయన వెంటనే డీఈని పిలవాలని ఆదేశించారు.

పారిశుధ్యం ఫొటోలను పరిశీలించారు. అలాగే మండలంలోని బూర్జివలస గ్రామం నుంచి ఆర్.రాజ్ కుమార్ భూ సమస్యపై ఫిర్యాదు చేశాడు. పాచిపెంట మండలంలోని గడివలసకు చందిన లెంక దాలినాయుడు తన పొలం 189.2 సర్వేనంబర్‌లో 1.26 ఎకరాల భూమి 1బి. వేరే పేరుతో ఇచ్చారని తన పేరున సవరించాలని అర్జీ చేసుకున్నాడు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డా.ఎస్ మన్మథ రావు డీపీఓ టి.కొండల రావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా సమన్వయ కర్త బి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

• వామపక్షాల డిమాండ్

పార్వతీపురంటౌన్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్ష నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్నతమైన వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌పై అమిత్ షా అహంకారపూరితమైన అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత రాజ్యాంగంపై 75 సంవత్సరాల సందర్భంగా చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా ఉన్నతమైన పదవిలో ఉన్న మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం చాలా దారుణమన్నారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం మనపై ఈరోజు ఉందని తెలియజేస్తున్నామన్నారు. ఈ రోజు దేశంలో దళిత గిరిజన మహిళలపై దుర్మార్గమైన దాడులు అవమానాలు ప్రతిరోజూ జరుగుతున్నా ఏమాత్రం కూడా స్పందించని ప్రధానమంత్రి మోడీ, అమిత్ షాను వెనకేసుకుని రావడం చాలా దారుణమని, కాబట్టి రాజ్యాంగబద్ధంగా లభించిన కేంద్ర హోం శాఖ మంత్రి పదవి నుంచి అమిత్ షా వెంటనే తప్పుకోవాలని, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇలా జరగని ఎడల ఇంకా పెద్ద ఎత్తున ఈ ఆందోళన భవిష్యత్తులో చేస్తామని, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం తిరుపతిరావు, జి.వెంకటరమణ, వి.ఇందిర, సీపీఐ నాయకులు సూరమ్మ, డి.రమణారావు, కొల్లి సాంబమూర్తి, పాలకల సన్యాసిరావు, బీవీ.రమణ, దళిత గిరిజన యువకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. దీనిపై జీఆర్‌పీ ఇన్‌చార్జ్ ఎస్సై రత్నాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం గుణానపురం గ్రామానికి చెందిన చింతాడ గోవింద్ పనినిమిత్తం పార్వతీపురం వచ్చాడు. బహిర్భూమికి వెళ్లేందుకు పార్వతీపురం టౌన్- బెలగాం రైల్వేస్టేషన్‌ల మధ్యలో ట్రాక్ దాటుతుండగా ఎర్నాకులం రైలు ఢీకొంది. ఈ ఘటనలో గోవింద్‌కు గాయాలయ్యాయి. గమనించిన పోలీసులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ 2 వెంకటరమణ

సీతానగరం: మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను ఎంఈఓ -2 ఎం.వెంకటరమణ అభినందించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఐ.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ-2 ఎం వెంకటరమణ మాట్లాడుతూ 9 పాఠశాలల నుంచి పాల్గొన్న 40 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది సైన్స్ ఫెయిర్‌లో వివిధ రకాల ప్రయోగాల ప్రాజెక్ట్‌లను ప్రదర్శించినట్లు తెలియజేశారు. మండల స్థాయిలో విజేతలు జనవరి 3న జిల్లా స్థాయిలో జరగనున్న సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారని అన్నారు. పోటీలో నిడగల్లు, బూర్జ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు తెలియజేశారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ

జియ్యమ్మవలస: స్థానిక వెలుగు కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లి చేయాలని, అలా కాదని ఆ వయసులోపు చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ విషయంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి, డాక్టర్ పి.జగదీష్, వెలుగు ఏపీఎం త్రినాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ, వైజ్ఞానిక దృక్పథం



ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ-1, ఉపాధ్యాయులు

బలిజిపేట: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విజ్ఞానదాయకంగా ఆలోచించడం అలవడతాయని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ ఆలోచన విధానం ఉండాలన్నారు. నూతన విజ్ఞాన పరిశోధన అంశాలు ప్రదర్శించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్స్ దోహదపడతాయన్నారు. మండలంలోని అన్ని ఉన్నత, యూపీ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరైన ఈ పోటీల్లో జిల్లాస్థాయికి వంతరాం కేజీబీవీ విద్యార్థులు తయారుచేసిన సమీకృత వ్యవసాయ విధానం, నారాయణపురం ఉన్నత పాఠశాల ప్రాజెక్టు రివర్ క్లీనింగ్ రోబోట్, బలిజిపేట ఉన్నతపాఠశాల ప్రాజెక్టు ట్రాఫిక్ కంట్రోల్ మెథడ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. క్విజ్ పోటీల్లో జె.నరేష్(పెదపెంకి), కె.మణికంఠ(అజ్జాడ)లు జిల్లా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ-1సామల

ఆరోగ్య కేంద్రాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: క్షేత్రస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని ములగ, కవిటిభద్ర గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేలు ఏ మేర పూర్తి చేశారని వైద్య సిబ్బందిని ఆరా తీసి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ములగ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్న తీరు, ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సంజీవని వైద్య సేవలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో పరిశీలించి తగు సూచనలు చేశారు. రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులు పరిశీలించి ప్రతిరోజూ ఎంతమందికి వైద్య పరీక్షలు చేపడుతున్నారో వివరాలను పరిశీలించారు. అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సిక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్యకార్యాలయ గణాంక అధికారి శంకర్ రావు, ప్రిన్సిపాల్ మణి, ఏపిడమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్‌వైజర్ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది లక్ష్మి, సునీత, భారతి, సుమిత్ర ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

కొమరాడ: మండలంలో ఇటీవల కురిసిన తుపాను వర్షాలకు మలేరియా జ్వరం వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని మాదలింగి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరిలోనైనా మలేరియా వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే తక్షణమే వారికి చికిత్స అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి ముంగిట అనవసర నీటి నిల్వలను తొలగించాలన్నారు.

చెత్తనుంచి సంపద తయారు చేయాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో సంపద తయారు చేయడానికి పంచాయతీ పాలకులు సమాయత్తం కావాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీలు ఆర్థికంగా బలపడడానికి చెత్తనుంచి సంపద తయారీ విధానాన్ని సిబ్బందికి వివరించారు. గ్రీన్‌అంబాసిడర్లు సేకరించిన తడిచెత్త, పొడి చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేలా గతంలో సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పెదభోగిలి పంచాయతీలో ఇటీవల సేంద్రియ ఎరువుతయారు చేసి విక్రయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తాజాగా సేకరించిన చెత్తనుంచి సంపద తయా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, కార్యదర్శి ఈ రమేష్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఏఐడీఆర్ఎమ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గుజ్జల జనార్దన్

పార్వతీపురంటౌన్: అలిండియా దళిత రైట్స్ మూమెంట్ (ఏడీఆర్ఎం)జాతీయ మహాసభలు జనవరి 5నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గుజ్జల జనార్దన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5వ తేదీన మోక్షగుండం విశ్వేశ్వరయ్య కళా మందిర్‌లో జరగనున్న బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దళితులు ఎదుర్కొంటున్న మౌలికమైన సమస్యలను పరిష్కరించాలని. దళితులను ఆర్థికంగా, సామజికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా తోడ్పాటు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, దళితుల పట్ల వివక్షం కొనసాగుతూనే ఉందని, ఇప్పటికైనా దళితులు మేల్కొని మనకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని దళితులకు మాత్రమే రాశారన్న భ్రమలో అగ్రకులాల వారు ఉండడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయుకులు బి.మోహన్, గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాద్, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి గుర్తింపు



పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్‌కు, ఎస్సై గోవింద్‌లకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో గంజాయి పట్టివేత, ప్రాపర్టీ నేరాలు, ముద్దాయిలకు శిక్షలు పడడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్కర్స్, గుడ్‌వర్కర్స్ తదితర అంశాలపై చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబరిచిన వారికి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ప్రశంసా పత్రాలను ప్రదానం చేసి ప్రశంసించారు. మొత్తంగా 31 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిభను గుర్తించినప్పుడే మరింత ఉత్సాహంగా పనిచేస్తారని, ప్రతి ఒక్కరికీ ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, ఆ నైపుణ్యాన్ని గుర్తిస్తేనే ఆ దిశగా దర్యాప్తులో కీలకంగా వ్యవహరిస్తారని అభిప్రాయ పడ్డారు.

ఘనంగా జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలు



సమస్యలు పరిష్కరిస్తామని నినాదాలు నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నుతన కార్యవర్గం

సీతానగరం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలో సోమవారం నిర్వహించిన మండల మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్ష కార్యదర్శులు దిలీప్, డేవిడ్‌లు మాట్లాడుతూ మండల మహాసభల అనంతరం ఇదే వేదికగా 22 మందితో మండల కమిటీ వేయనున్నామన్నారు. ఈ మహాసభలను ఉద్దేశిస్తూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్ మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా హానర్స్ డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నపటికీ హాస్టల్ సదుపాయం లేదన్నారు. పరిశీలనలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామని తెలియజేశారు. అలాగే జనవరి 4,5 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు హెచ్.సింహాచలం పట్టణ కమిటీ సభ్యుడు సాయికుమార్ అదేవిధంగా సీతానగరం మండల కమిటీ సభ్యులు దీపిక, కిషోర్, మణి కార్తీక్, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి బుద్దేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రుషినికాలనీ, నిగరాం, జొల్లగూడ, కన్నయ్యగూడ, జేకే పాడు గ్రామాల్లో రక్తహీనత నివారణపై తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం కళాకారుల కళాజాత ప్రదర్శన ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని అరికట్టేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆరోగ్య విభాగం వారు.. అవగాహన కల్పిస్తున్నారన్నారు. సికిల్ సెల్ ఎనీమియా అనేది ఒక జన్యుపరమైన వ్యాధి అని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి చేసే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయని, సాధారణ రక్త కణాల కన్నా సికిల్ సెల్స్(కణాలు) మందంగా ఉంటాయన్నారు. తద్వారా శరీరంలోని వివిధ అవయవాలకు రక్తం సరఫరా సక్రమంగా జరగక తీవ్ర అనారోగ్యం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో తగిన చికిత్స తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎస్.వి.ప్రకాష్, బి.లక్ష్మణ, దీపిక, జ్యోతి, లక్ష్మి, ధనలక్ష్మి, సీహెచ్‌వోలు స్వాతి, దివ్య భారతి, అనూష పాల్గొన్నారు.